- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
27-03-2026

సంపుటి : 01 సంచిక : 5 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 NAMASTEY MAHAAPRABHA



# ఏపీలో ఘోర బస్సు ప్రమాదం

## మంటలు చెలరేగడంతో 14 మంది సజీవదహనం

- మార్కాపురం జిల్లా రాయవరంలో ఘటన
- టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తుండగా ఘటన
- ప్రమాద సమయంలో బస్సులో 40మంది ప్రయాణికులు
- గురువారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ఈ ప్రమాదం



మార్కాపురం మార్చి 26 (మహాప్రభ)

ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మార్కాపురం జిల్లాలోని రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న 14మంది సజీవదహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోందిప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తుండగా.. రాయవరం క్వారీల వద్ద వేగంగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. చీమకుర్తి నుంచి కంకర లోడుతో టిప్పర్ వెళ్తుంది. తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

-మిగతా 3 లో

## రెండింటికీ నిధుల కోత

# ప్రసక్తే లేదు

### వాటికి అవసరమైన ఫండ్ కేటాయిస్తాం



- విద్య, వైద్య రంగాలపై సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్ఆర్ఐ డాక్టర్ల సేవలను వినియోగించుకుంటాం
- అందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్
- బోధనాస్పత్రుల్లో పని చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు
- పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించటమే ధ్యేయం
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ముఖ్యమంత్రి సమాధానం

హైదరాబాద్ మార్చి 26 (మహాప్రభ)

విద్య, వైద్య రంగాలకు కేటాయించే నిధుల్లో కోత విధించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాటికి చాలినంత ఫండ్ కేటాయిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణలో వైద్య విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడిన ప్రముఖ వైద్యులు... ఇక్కడకు వచ్చినప్పుడు ప్రభుత్వ దవాఖానాలు, బోధనాసుపత్రుల్లో వారి సేవలను వినియోగిం చుకునేలా ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

-మిగతా 3 లో



# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా
- దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా
- సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి

హైదరాబాద్, మార్చి 26 (మహాప్రభ)

:బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి

-మిగతా 3 లో



## ఇరాన్‌కు మరోమారు

# ట్రంప్ వార్నింగ్

- ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి
- 'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది
- తిరిగి పుంజుకునే అవకాశం లేదు
- త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక

వాషింగ్టన్, మార్చి 26 (మహాప్రభ)

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి

-మిగతా 3 లో



## మిత్రదేశాల జాబితాను ప్రకటించిన ఇరాన్..

- ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్,
- ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది.
- ఆ దేశాల నౌకలకే అనుమతి..
- వాటిలో ఇండియా కూడా ఉండటం విశేషం.

న్యూఢీల్లీ మార్చి 26 (మహాప్రభ)

హార్ముజ్ జలసంధి మూసివేయడంతో అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఈ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ మిత్రదేశాలకు మాత్రమే ఈ జలసంధి నుంచి నౌకల రవాణాకు అనుమతులు మంజూరు చేస్తామని ఇరాన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మిత్రదేశాలు, శతృదేశాల జాబితాను విడుదల

-మిగతా 3 లో

## వినియోగదారులకు షాక్

- పెట్రో, డీజిల్ ధరలు పెంచి నయారా
- లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పన పెంచింది

న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)

ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను





-మిగతా 3 లో

## నేడు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

### పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్



- చమురు భద్రత, సరఫరా మార్గాలపై ప్రధాని ప్రత్యేక నజర్.
- యుద్ధ సంక్షోభం వేళ 'టీమ్ ఇండియా'గా ఐక్యంగా ఉండాలని మోదీ పిలుపు.
- ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల సిఎంలు దూరం
- సమావేశం అనంతరం కీలక నిర్ణయాలు ప్రకటించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 26 (మహాప్రభ)

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు,

-మిగతా 3 లో

## కవిత కొత్త పార్టీ

# తెలంగాణ ప్రజా జాగృతి

- నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన
- పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది
- రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం



నిజామాబాద్ మార్చి 26 (మహాప్రభ)

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని

-మిగతా 3 లో





### సోషల్ మీడియాకు బానిసవుతున్న యువత..

మెటా, యూట్యూబ్‌కు భారీ జరిమానా



### మార్చి 28న బెంగాల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా

2 లో

## ఆరోగ్యశ్రీపై అబద్దాలు

# చెప్పే ప్రయత్నం

### మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు

- కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్, మార్చి 26 (మహాప్రభ)

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి

-మిగతా 3 లో

# కీలక బిల్లుకు కెనడా చట్టసభ ఆమోదం..

ఇక ఖలిస్థానీ ఆగడాలకు అడ్డుకట్ట..!




**న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)**
కెనడా చట్టసభ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. విద్వేషపూరిత చర్యలు, నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కంబాటింగ్ హేట్ బిల్లుకు ఆ దేశ చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదముద్ర వేసింది. అనంతరం ఆ బిల్లును ఎగువసభకు పంపించారు. ఈ బిల్లు చట్టంగా మారి అమలులోకి వస్తే ప్రార్థనా స్థలాలపై దాడులకు, ఖలిస్థానీ మద్దతుదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ చట్టం ప్రకారం విద్వేష చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఈ చట్టం కోసం కెనడాలోని భారత సంతతి వ్యక్తులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు పెరిగిపోయాయి. కొన్ని వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడుతుండటం, విధ్వంసం సృష్టించడం తదితర ఘటనలు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలపై అక్కడి భారతీయులు చాలా ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో విద్వేష చర్యలకు సంబంధించి కొత్త బిల్లు ఆమోదం పొందడం ఆహ్వానించదగిన పరిణామంగా చెప్పవచ్చు.

## మార్చి 28న బెంగాల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా



**న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), బిజెపిల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొననుంది. దీంతో ఇరుపార్టీలు ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నాయి. మార్చి 28న కేంద్ర హోంమంత్రి అమిత్ షా బెంగాల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అధికారంలో ఉన్న టిఎంసి అవకతవకల్ని బయటపెట్టేందుకు ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రజల ముందుంచనున్నారు. అలాగే టిఎంసిపై ఛార్జిషీటును దాఖలు చేయనున్నారు. కాగా, మార్చి 28వ తేదీన హోం మంత్రి అమిత్ షా ఒక ముఖ్యమైన పత్రికా సమావేశం నిర్వహించి, టిఎంసి ప్రభుత్వంపై ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు. గత కొన్నేళ్లుగా టిఎంసి ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, పాలనా వైఫల్యాలు, శాంతిభద్రతల సమస్యలపై ఛార్జిషీట్‌లో సమగ్ర వివరాలు పొందుపరిచే అవకాశం ఉందని బెంగాల్ బిజెపి పార్టీ తెలిపాయి. ఛార్జిషీట్‌త్‌పాటు మమతా 15 ఏళ్ల పాలనలో అవినీతి, ఇతర అంశాలను ఎత్తిచూపుతూ బిజెపి ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయనుంది.




# సోషల్ మీడియాకు బానిసవుతున్న యువత..

మెటా, యూట్యూబ్‌కు భారీ జరిమానా



**లాస్ ఏంజిల్స్:మార్చి 26 (మహాప్రభ)**
సోషల్ మీడియా కు యువత బానిసలు అవుతున్నట్లు నమోదు అయిన కేసులో.. మెటా, యూట్యూబ్ సంస్థలకు అమెరికా కోర్టు భారీ జరిమానా వేసింది. చిన్నతనం నుంచి సోషల్ మీడియాకు బానిసైనట్లు ఓ మహిళ దాఖలు చేసిన కేసులో లాస్ ఏంజిల్స్ జ్యూరీ అసాధారణ తీర్పును వెలువరించింది. ఆ అమ్మాయికి రెండు కంపెనీలు కలిసి సుమారు 6 మిలియన్ల డాలర్ల నష్టపరిహారాన్ని చెల్లించాలని జ్యూరీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. సోషల్ మీడియా కాంటెంట్ సిగరెట్ల తరహాలో యువతను బానిసలుగా మారుస్తున్నట్లు జ్యూరీ ఆరోపించింది. పిల్లలు, యువకులు సోషల్ మీడియా తప్ప మరో ప్రపంచాన్ని గ్రహించలేకపోతున్నట్లు జ్యూరీ చెప్పింది. సోషల్ మీడియా వల్ల వ్యక్తిగతంగా మనుషులు నష్టపోతున్నారని పేర్కొన్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంపెనీ యజమానులు.. పిల్లల సంరక్షణ మరిచి తమ సోషల్‌మీడియా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జ్యూరీ వెల్లడించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ .. ప్రస్తుతం మెటా పరిధిలో ఉన్నాయి, ఇక యూట్యూబ్ మాత్రం గూగుల్ ఆధీనంలో ఉన్నది. అయితే ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అన్నీ యువతను ఆకర్షించే రీతిలో తమ ప్రోగ్రామింగ్‌ను తయారు చేసుకున్నట్లు జ్యూరీ పేర్కొన్నది. అడిక్షన్ కేసులో 20 ఏళ్ల అమ్మాయి మానసిక ఆరోగ్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీసినట్లు జ్యూరీ వెల్లడించింది. కాలే అనే అమ్మాయికి 6 మిలియన్ల డాలర్లు చెల్లించాలని జ్యూరీ సభ్యులు ఆదేశించారు. అయితే ఇలాంటి మీడియా అడిక్షన్ కేసులు ప్రస్తుతం అమెరికా కోర్టుల్లో కొన్ని వందల సంఖ్యల్లో ఉన్నాయి. తాజా తీర్పుతో ఆ కేసులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని నిపుణులు అంటున్నారు. జ్యూరీ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు మెటా, గూగల్ సంస్థలు పేర్కొన్నాయి. టీనేజీ యువత మానసిక ఆరోగ్యం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, ఒకే ఒక్క యాప్‌తో అవన్నీ లింకు పెట్టడం సరికాదు అని ఆ సంస్థలు వాదించాయి. గూగుల్ ప్రతినిధి మాట్లాడుతూ యూట్యూబ్ గురించి తప్పుగా అర్థం చేసుకున్నారని, యూట్యూబ్ అనేది స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ అని, అదేమీ సోషల్ మీడియా సైట్ కాదు అని పేర్కొన్నారు. కాలే అమ్మాయి కేసులో మెటా సంస్థ 70 శాతం, గూగల్ సంస్థ 30 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ..

**-ఎలైట్ నావెల్ ఫోర్స్ చీఫ్ హతం..**
**- వెల్లడించిన ఇజ్రాయెల్**



**న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)**
ఇజ్రాయెల్‌తో యుద్ధంలో వరుసగా అగ్రనాయకత్వాన్ని కోల్పోతున్న ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ఎలైట్ నావెల్ ఫోర్స్ (నావికా దళం) చీఫ్ అలీరెజా తాంగ్సిరి మరణించాడు. తాము జరిపిన వైమానిక దాడుల్లో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్ నావికా దళానికి నాయకత్వం వహిస్తున్న టాప్ కమాండర్ అలీరెజాను పోర్ట్ సిటీ అయిన బందాకం అబ్బాస్ వద్ద హతమార్చినట్లు ప్రకటించింది. అలీరెజా ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీలోని నావికా దళ విభాగానికి నాయకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి మూసి ఉన్న సంగతి తెలిసిందే. అయితే, అసలు ఇరాన్ ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణం అలీరెజానే. అతడు మరణించాడని ఇజ్రాయెల్ ప్రకటించినప్పటికీ, ఇరాన్ మాత్రం దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇరాన్, దేశ భద్రతా దళాలు ఈ విషయాన్ని ధృవీకరించలేదు. 2018 నుంచి అలీరెజా నావికాదళానికి నేతృత్వం వహిస్తున్నాడు. ఆయనను సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ నియమించాడు. ఇరాన్ నావికా దళ సామర్థ్యం పెంచడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. దేశంలో తొలి డ్రోన్ క్యారియర్ నౌకను ఆవిష్కరించాడు. తమకు ఎదురొస్తే నరకాన్ని చూపిస్తామని శత్రువులను హెచ్చరించాడు. అలాగే, తమతో సముద్ర ప్రాంతంలో పోరాడే స్తాయి అమెరికాకు లేదని గత ఏడాది అలీరెజా తెలిపాడు. ప్రస్తుతం ఇజ్రాయెల్ వరుసగా ఇరాన్‌పై దాడులకు దిగుతోంది. ఒకేసారి అటు ఇరాన్‌పై, ఇటు లెబనాన్‌పై దాడులు చేస్తోంది. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ స్థావరాలపై కూడా దాడులు నిర్వహిస్తోంది. ఈ దాడుల్లో తమ సైనికుడు మరణించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

# యుద్ధంలో అమెరికా గెలువదు, ఇరాన్ ఓడదు..

**రాందేవ్ బాబా కామెంట్**



**న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)**
ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంపై యోగా గురు, పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో అమెరికా గెలువదని, ఇరాన్ ఓడిపోదని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి స్థాపనలో భారత్ కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. హరిద్వార్ లోని పతంజలి యోగపీఠ్ లో జరిగిన రామనవమి వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ యుద్ధంలో అమెరికా గెలువదు, ఇరాన్ ఓడిపోదని నేను గతంలో చెప్పాను. 1000-1200 కిలోమీటర్ల నుంచి 4000-5000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం ద్వారా.. కేవలం ఆయుధాలను వినియోగించడం ద్వారా ఎవరూ ఎవరినీ భయపెట్టలేరని ఇరాన్ నిరూపించింది' అని రాందేవ్ విశ్లేషించారు. ప్రజాస్వామ్యం అంటే ఇతరులను భయపెట్టడం కాదని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గర్వపడే అమెరికా, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని కూడా గౌరవించాలని చెప్పారు. పశ్చిమాసియాలో సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ కీలకపాత్ర పోషించాలని రాందేవ్ ఆకాంక్షించారు. 'వసుధైక కుటుంబం' అనే సిద్ధాంతం ఆధారంగా ప్రపంచాన్ని ఏకతాటిపైకి తీసుకురావాలన్న సందేశాన్ని భారత్ ఇస్తూనే ఉండాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయంగా, దౌత్యపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారని కొనియాడారు. ఎవరైనా మధ్యవర్తిత్వంతో యుద్ధం ఆపగలిగితే అది భారతే అన్నారు. ఈ యుద్ధం వల్ల తలెత్తిన పెట్రోల్, గ్యాస్ సంక్షోభానికి, ప్రపంచ ఆర్థిక మాంద్యానికి చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అదే సమయంలో శ్రీరామనవమి పర్వదినం ప్రాముఖ్యతను వివరిస్తూ.. దేశ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ మీడియా ప్రభావంతో యువత, ముఖ్యంగా కుమార్తెల శీలం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి పండుగలను పిల్లల్లో మన గొప్ప సాంస్కృతిక వారసత్వంపై బలమైన అవగాహన కల్పించడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. దేశ విదేశాంగ విధానం లాంటి జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు.

# మీ పిల్లలను నరకానికి పంపొద్దు..

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ వార్నింగ్



**న్యూఢిల్లీ మార్చి 26 (మహాప్రభ)**
పశ్చిమాసియా లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ పై భూతల దాడికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తీవ్ర హెచ్చరిక చేసింది. 'మీ పిల్లలను, సైనికులను ఇరాన్ గడ్డ మీదికి పంపి వారిని బలి చేయవద్దు' అని అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేసింది. ఇరాన్ సరిహద్దుల వద్ద అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భూతల దాడులకు సిద్ధమవుతున్నాయంటూ వినపడుతున్న వార్తల నేపథ్యంలో ఐఆర్‌జీసీ ఈ హెచ్చరికలు చేసింది. తమ దేశంలోకి అడుగుపెట్టే ఏ శత్రు సైనికుడు కూడా ప్రాణాలతో తిరిగి బయటికి వెళ్లలేదని స్పష్టంచేసింది. దేశ రక్షణ కోసం లక్షలాది మంది సైనికులు, అత్యాధునిక క్షిపణులు సర్వసన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ ప్రకటించింది. తమను తాము రక్షించుకోవడమే కాకుండా శత్రువుల స్థావరాలపై ఎదురుదాడి చేసే సామర్థ్యం కూడా తమకు ఉందని ఇరాన్ పేర్కొన్నది. ఒకవేళ యుద్ధం ప్రారంభమైతే అది కేవలం ఇరాన్‌కే పరిమితం కాదని, మొత్తం పశ్చిమాసియాకు వ్యాపిస్తుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన శత్రు దేశాల ప్రజలలో భయాందోళనలు సృష్టించేందుకు మానసిక యుద్ధానికి తెరలేపినట్లు అనిపిస్తోంది. 'యుద్ధానికి మీ పిల్లలను పంపి అనవసరంగా చంపించవద్దు.. వారిని నరకానికి పంపిచవద్దు' అనే నినాదాన్ని ఇరాన్ సైన్యం విస్తృతంగా ప్రచారంలోకి తెస్తున్నది. మా దేశంలో అడుగుపెడితే చంపేస్తామంటూ మానిసికంగా ఇజ్రాయెల్ ప్రజలను భయంలోకి నెడుతోంది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి.

# ఏపీలో ఘోర బస్సు ప్రమాదం

మొదటి తరువాయి



ఒడు వాహనాలు బలంగా ఢీకొనడంతో బస్సులోని డీజిల్ ట్యాంక్ పగిలి క్షణాల్లోనే మంటలు చెలరేగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మంటలు రెండు వాహనాలకు వ్యాపించడంతో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 40మంది ప్రయాణికులు ఉన్నారని సమాచారం. ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా నమోదైందని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కొందరు ప్రయాణికులు బస్సు కిటికీ అద్దాలను పగలగొట్టి ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, పలువురికి తీవ్రగాయాలు కాగా.. వారిని చికిత్స నిమిత్తం సమీపంలో మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పలువురికి తీవ్ర గాయాలు కావడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మృతుల్లో కనిగిరి ప్రాంతానికి చెందిన వారు ఉండొచ్చని భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు.

# ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

మొదటి తరువాయి



చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది . ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

# మిత్రదేశాల జాబితాను ప్రకటించిన ఇరాన్..

మొదటి తరువాయి

చేసింది. ప్రధానంగా ఐదు దేశాల్ని మిత్రదేశాలుగా పేర్కొంది. వాటిలో ఇండియా కూడా ఉండటం విశేషం. ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది. ఈ దేశాలకు చెందిన నౌకల్ని హోర్ముజ్ జలసంధి గుండా అనుమతిస్తామని ఇరాన్ తెలిపింది. ఇప్పటికే రెండు నౌకలు బయల్దేరాయని వెల్లడించింది. అలాగే, బంగ్లాదేశ్ నౌకల్ని కూడా అనుమతిస్తామని చెప్పింది. ఈ దేశాలు ఇప్పటికే తమతో మాట్లాడాయని, తమతో సమన్వయం చేసుకుంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. భవిష్యత్తులోనూ ఈ దేశాలకు సహకారం అందిస్తామని, యుద్ధం ముగిసిన తర్వాత కూడా సహాయం కొనసాగుతుందని ఆయన చెప్పారు. మిత్రదేశాలతోపాటు తాము అనుమతించేది లేని శత్రుదేశాల జాబితాను కూడా ఇరాన్ ప్రకటించింది. ఈ జాబితాలో అమెరికా, ఇజ్రాయెల్, యుద్ధంతో సంబంధం ఉన్న కొన్ని గల్ఫ్ దేశాలు, యుద్ధంలో కీలక పాత్ర పోషించిన దేశాలతో సంబంధాలు కలిగి ఉన్న కూటమి దేశాలున్నాయి. ఈ దేశాలకు చెందిన నౌకల్ని అనుమతించబోమని అరాగ్చి స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ దేశం యుద్ధం చేస్తోందని, యుద్ధం సమయంలో శత్రుదేశాల నౌకల్ని అనుమతించబోమని, అయితే, ఇతరులకు మాత్రం అనుమతి ఉంటుందన్నారు. మిత్రదేశాల నౌకలు ఈ మార్గం గుండా వెళ్లాలన్నా తగిన నిబంధనలు పాటించాల్సిందే. పూర్తి సమన్వయం తర్వాతే నౌకల్ని అనుమతిస్తారు. ఇప్పటికే కొన్ని నౌకలకు అనుమతి లభించింది. ఈ విధానం సంక్షోభం తర్వాత కూడా కొనసాగుతుంది. మిత్రదేశాలకు ఎప్పటికీ హోర్ముజ్ జలసంధి అందుబాటులో ఉంటుంది. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై ఇకనుంచి టోల్ వసూలు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఇప్పటికే కొన్ని నౌకలు టోల్ చెల్లించినట్లు సమాచారం.

# వినియోగదారులకు షాక్

మొదటి తరువాయి




ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# ఆ రెండింటికీ నిధుల కోత ప్రసక్తే లేదు

మొదటి తరువాయి

శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత తన్నీరు హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్... ఆరోగ్యశ్రీ బకాయిల అంశాన్ని లేవనెత్తారు. వారి ప్రశ్నలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిచ్చారు. ఈ దశలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని... వైద్యారోగ్య శాఖలో ప్రభుత్వం చేపడుతున్న పలు సంస్కరణలను సోదాహరణంగా వివరించారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు వర్తించే విధంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ఇటీవలే ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ఏదైనా కారణం చేత కుటుంబ పెద్ద చనిపోతే ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా ఉంటుందనే ధీమాను ఆ పథకం కల్పిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీని అమలు చేసి, అక్కడి వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. ఆస్పత్రుల నిర్వహణ, వైద్య సేవల పర్యవేక్షణ... ఈ రెండింటి బాధ్యతలను ఒక్కరికే కాకుండా వేర్వేరు విభాగాలుగా మారుస్తామని చెప్పారు. వైద్యులను కేవలం వైద్య సేవలకే పరిమితం చేస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్‌వోసీ అనే విధానం కేవలం నిమ్స్‌కే పరిమితమైందని



గుర్తు చేశారు. దాన్ని అన్ని బోధనాసుపత్రులతోపాటు సనత్‌నగర్, అల్వాల్ తదితర ప్రాంతాల్లోని టిమ్స్‌లకు కూడా వర్తింపజేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య రంగంలో త్వరలో మరో పది వేల పడకలను అందుబాటులోకి తెస్తామని సీఎం చెప్పారు. తద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తామని హామీనిచ్చారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి గత బీఆర్ఎస్ హయాంలో కేటాయించిన నిధులను, ప్రస్తుత పరిస్థితితో పోల్చి సీఎం ఏకరువు పెట్టారు. గతంలో ఆ పథకానికి ప్రతినెలా రూ.52 కోట్లను ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.89 కోట్లను ఖర్చు చేస్తున్నామని వివరించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఆరోగ్య శ్రీ కింద మొత్తం రూ.2,408.51 కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి ఆ పథకం బకాయిలు రూ.600 లక్షలు పేరుకు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి ఆ బకాయిలు రూ.727 కోట్లకు చేరాయని, అంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడ్డ బకాయిలు కేవలం రూ.127 కోట్లేనని స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు సుమారుగా రూ.496 కోట్లు, ప్రయివేటుకు రూ.231 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతినెలా రూ.102 కోట్ల విలువైన వైద్యసేవలందిస్తే, ఇప్పుడు రూ.184 కోట్ల సేవలందుతున్నాయని చెప్పుకొచ్చారు.

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

మొదటి తరువాయి

జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు



కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.

# నేడు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

మొదటి తరువాయి

భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల



ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

మొదటి తరువాయి



తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

--------

# కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

మొదటి తరువాయి

జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## సంపాదకీయం

# మతం మారితే హక్కులు మాయమా?




భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవప్రద జీవన హక్కులకు హామీనిస్తుంది. శతాబ్దాలుగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం కూడా అందులో భాగమే. కులవివక్ష, అంటరానితనం, ఆర్థిక వెనుకబాటు వంటివి దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఈ హక్కులు ఒక లక్ష్యంతో రూపుదిద్దుకున్నవి అయితే, మతం మార్పిడి చేసుకున్న వ్యక్తికి షెడ్యూల్ కులాల హక్కులు వర్తించవని భారత అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేయడం ఇప్పుడు అనేక సందేహాలకు తావిస్తోంది. ఓ కేసు సందర్భంగా చెప్పిన ఈ మాట మత మార్పిడి తర్వాత షె డ్యూల్ కుల హక్కులపై అనేక సందేహాలను లేవనెత్తింది. ఇది తుది తీర్పు కాకపోయినప్పటికీ సామాజిక న్యాయం దిశలో కీలకమైన ప్రశ్నలకు ముందుకుతెచ్చింది. అసలు రిజర్వేషన్లకు మతానికి సంబంధం ఉందా? లేదంటే అది సామాజిక వాస్తవాల ఆధారానికి ప్రతిబింబమా? ఇదీ ఇప్పుడు జరుగుతున్న చర్చ. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు వ్యక్తి జీవన పరిస్థితులను మెరుగుపరచ డానికి ఉపయోగపడాలి కానీ, వాటిని పరిమితం చేయడానికి కాదు. సుప్రీంకోర్టు ఏ ఆలోచనతో మాట్లాడినా రిజర్వేషన్లను మతంతో అనుసంధానిం చడం సరైంది కాదనేది న్యాయ నిపుణుల భావన. దేశంలో అట్టడుగు నుంచి మొదలుకుంటే అగ్రస్థాయి వరకు కులవివక్ష ఏదో ఓ రూపంలో చాపకింద నీరులా కొనసాగుతున్న మాట వాస్తవం. ఒక వ్యక్తి క్రైస్తవ మతానికి మారినంత మాత్రాన అతను ఎదుర్కొనే సామా జిక వాస్తవాలు వెంటనే సమసిపోవు. దీన్ని కోర్టు గుర్తించకపోవడం అనడం కంటే, ఒక అభిప్రాయాన్ని వెల్లడి చేయడం రిజర్వేషన్లను పక్కనపెడుతున్నారనే భావనకు అవకాశం కల్పిస్తుంది. షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు భారత రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలపై ఆధారపడి ఉన్నాయి. తరాలుగా వెనుకబాటుతానికి గురైనవారికి అండగా నిలిచాయి. ఇది కేవలం న్యాయపరమైన సమస్యకాదు, సామాజిక అంతరాల అంశం. ఒకే కులానికి చెందిన ఇద్దరిలో ఒకరు మతం మార్చుకున్నారని హక్కులు నిరాకరించడం సమానత్వానికి పూర్తి విరుద్ధమవుతుంది. ఇంకా చెప్పాల్సి వస్తే మత స్వేచ్ఛ రాజ్యాంగం ఇచ్చిన హక్కు. వ్యక్తి తన విశ్వాసాన్ని ఎంచుకునే స్వేచ్ఛను రక్షిస్తుంది. ఇప్పుడు మతం మారితే హక్కులు కోల్పోతామన్న భావన వస్తే పరోక్షంగా అతని స్వేచ్ఛను కూడా పరిమితం చేసినట్టే. అందుకే ఇలాంటి అంశాల్లో విస్తృతంగా, రాజ్యాంగపరమైన అంశాలన్నీ పరిశీలించి నిర్ధారణకు రావాలే కానీ, అభిప్రాయాల ద్వారా సామాజిక నిర్ణయాలను నిర్ణయించడం భావ్యం కాదు.హిందూ సామాజిక వ్యవస్థలోనే కుల వ్యవస్థ ఉనికిలో ఉందని, క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత కులగుర్తింపు వర్తించదనే న్యాయస్థానం భావనగా ఉంది. ఇది ఏ రకంగా చూసినా వాస్తవ పరిస్థితులకు పోలదు. ఎందుకంటే, భారత సమాజంలో కులం అనేది కేవలం మతానికే పరిమితం కాదు, అది అడుగడుగునా వేళ్లూనుకుని ఉన్న మర్రిచెట్టు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ, మతం మారిన వ్యక్తిపై ఉన్న కులముద్ర తొలగిపోదు. అయితే, వివక్ష రూపం మారవచ్చు, కానీ అంతరించదు. అధ్యయనాలు, కమిషన్లు కూడా ఈ విషయాలనే స్పష్టంగా చెప్పాయి. క్రైస్తవం లేదా ఇస్లాం మతంలోకి మారిన దళితులు కూడా సామాజికంగా అదే స్థితిలో కొనసాగుతారని, వారి జీవన పరిస్థితుల్లో పెద్దగా మార్పులేమీ ఉండవని పలు నివేదికలు పేర్కొన్నాయి. రిజర్వేషన్ల వ్యవస్థను రూపొందించినప్పుడు రాజ్యాంగ నిర్మాతలు ప్రధానంగా చెప్పిన విషయం -కుల ఆధారిత అణచివేతను రూపుమాపడం. ఇది కేవలం ఆర్థిక వెనుకబాటునే కాదు, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవితాలను సమానస్థాయికి తీసుకురావాలనే ప్రయత్నంఅది రక్షణ అనడం కన్నా హక్కుగా గుర్తించడం అవసరం. న్యాయస్థానం ఇదే అభిప్రాయంతో ఉంటే గనుక అది అనేక వర్గాలపై ప్రభావం చూపడం ఖాయం. ముఖ్యంగా అణగారిన వర్గాల్లో విభజనకు దారితీస్తుంది. దళితుల ఐక్యతను బలహీనపరుస్తుంది. మతం ఆధారంగా వారి హక్కులను వేరుచేయడం సామూహిక శక్తిని తగ్గిస్తుంది. మొత్తంగా ఇది సామాజిక న్యాయపోరాటాన్నే ప్రశ్నార్థకం చేస్తుంది. ఇది అమలైతే భవిష్యత్తులో ఇతర వర్గాల హక్కులపై ఇలాంటి ప్రమాణాలు అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒకసారి మతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే అది మరిన్ని హక్కులను పరిమితం చేస్తుంది. అందుకే ఇలాంటి కీలక విషయాలను ఒక నిర్దిష్ట కేసు పరిశీలన ఆధారంగా నిర్ణయానికి రావడం సరైంది కాదనే భావన అన్ని వర్గాల నుంచి వస్తోంది. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి, సామాజిక వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలి. సమా జంలో నిజమైన సమానత్వం సాధించాలంటే, రిజర్వేషన్లను మతంతో ముడిపెట్టకుండా క్షేత్రస్థాయి పరిస్థితులతో అనుసంధానించాలి.

# నేడు సీతారాముల కళ్యాణోత్సవం

**-ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటి**
**-పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.**



**మెదక్ జిల్లా -26మార్చ్ (మహాప్రభ ).**
శ్రీ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న 50వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజా రోహణం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవిఘ్నాలు చోటు చేసుకోకుండా, ఆలయానికి రక్షణగా ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి సుప్రభాతం భగవదారాధన, సేవాకాలం, బాలభోగం, నివేదన, మంగళ శాసనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం అవిఘ్నాలు కలగకుండా ఉండడానికి సేనాధిపతి విఘనాశకుడు అయినా నా విశ్వక్ కేసర్ రచన చేశారు. కర్మణ పుణ్యావా వచన, కుంభ వాహన, మండల ఆరాధన, తోరణ ఆరాధన నిర్వహించారు. అనంతరం దీక్షకు అగ్ని మథనం గావించి అగ్ని ప్రతిష్టాపన జరిపించి హోమం కార్యక్రమం చేపట్టారు.ముందుగా ప్రధాన ఆలయం నుంచి వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు మధ్య సమస్త రాజా లాంఛనాలతో చిరు కల్యాణ ఉత్సవ మూర్తులైన శ్రీ శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి వారిని ప్రధాన ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేయించి ధ్వజస్తంభం వద్దకు తొడ్కొని వచ్చారు. యాగశాల నుంచి గడపటాన్ని ఆలయం చుట్టూ ముమ్మార్లు ప్రదిక్షణ జరిపించి, అర్చక పరిచారక వేద పండితులు తీసుకొని రాగా బ్రహ్మోత్సవ రక్షణ నిమిత్తం గరుడ లార్డ్ ను ఆహ్వానించి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, మంగళాష్టకాలును అర్చకులు పఠించగా మంగళ వాయిద్యం ఘోష నడుము గరుడ పటాన్ని పైకి ఎగురవేశారు. అనంతరం బలిహరణం కార్యక్రమాన్ని నిర్వహించారు సంతానం లేని వారికి అందజేశారు ఈ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో ప్రసాదం స్వీకరించేందుకు మహిళలు ఆసక్తి చూపారు. సాయంత్రం దేవత్యోహ్యనము, భేరీ పూజ ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదిత కార్యక్రమాలు ఈ ఉత్సవమూర్తులు తో పాటు ఎనిమిది దిక్కుల బలిహరణం చేశారు.

మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధమైంది. రంగురంగుల పూలు, స్వాగత తోరణాలతో పెళ్లి వేడుకకు ముస్తాబైంది. ముత్యాల ముగ్గులు, తీరొక్కపూలతో అలంకరించిన పెళ్లి మండపం కల్యాణ క్రతువుకు సిద్ధమైంది. సిరి కల్యాణపు తిలకం, బుగ్గన చుక్క పాదాలకు పారాణితో వరుడు రామయ్య, కస్తూరి నామము, పూలజడ, బుగ్గన చుక్కతో వధువు సీతమ్మ తల్లి పెళ్లికి ముస్తాబయ్యారు. ఉదయం 9 గం. తిరుకల్యాణ మహోత్సవంతో కల్యాణ క్రతువు ప్రారంభంకానుంది. 10 గంటల ఎదుర్కోలు మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో రాములోరి పెండ్లి జరగనుంది. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దంపతులు సమర్పించనున్నారన్నారు . ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, పాల్గొననున్నారని ఈ వేడుకలకు సుమారు పదివేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లను ఆలయ కమిటి ఆధ్వర్యంలో పూర్తి చేశామన్నారు.ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటి చైర్మన్ బండ నరేందర్, సభ్యులు బాల్ రాజ్, పురుషోత్తం, నందిని శ్రీనివాస్, నగరం మల్లేశం, బద్రినాథ్, సకిలం శ్రీను, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు.

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -26మార్చ్ (మహాప్రభ )**
జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తాసిల్దార్లు , మైనింగ్ ,ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100% ఇసుక సరఫరా "మన ఇసుక వాహనం" ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**-రూ. 1 లక్ష జరిమానా విధించిన కోర్టు**
**-నేరస్తుడు తూప్రాన్ మండలం జండాపల్లి కి చెందిన సోమగారి భాస్కర్**




**మెదక్, మార్చి 26 (మహాప్రభ)**
తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన లైంగికదాడి కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు. తూప్రాన్ పీఎస్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగికదాడి చేసినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు.మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. అనంతరం సీఐ శ్రీధర్ సమగ్రంగా దర్యాప్తు చేసి పక్కా సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడీఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు. ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## శ్రీ కోదండ రామాలయం లోని సీతారాముల కళ్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు.

**గోదావరిఖని న్యూస్ మార్చి 26 మహాప్రభ**
11 డివిజన్ శ్రీ కోదండ రామాలయం లో పోలీస్ డిపార్ట్మెంట్ ఏసిపి కి సిఐ కి ట్రాఫిక్ సిఐ కి సింగరేణి శీనన్నకు సీతారాముల కళ్యాణం పనుల గురించి వివరిస్తున్న కార్పొరేటర్ కారంగుల రమ్య (దాసరి విజయ్ కుమార్ ) దగ్గరుండి చూసుకుంటున్నారు.



# అసెంబ్లీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

**-రాకేష్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి**




**తూప్రాన్,మార్చి 26 (మహా ప్రభ)**
అసెంబ్లీ సభలో ఇందిరమ్మ పేరు ప్రస్తావించిన విధానంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రజనకు ప్రవీణ్ కుమార్, డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ మాట్లాడుతూ, సభలో సభ్యుడు రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచితమని మండిపడ్డారు. సారా అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో మాజీ ప్రధాని ఇందిరమ్మ పేరును ప్రస్తావించడం అత్యంత అవమానకరమని వారు పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. ఇందిరమ్మ దేశానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ, ఆమెను “ఉక్కు మహిళ”గా, “దేవత”గా పలువురు ప్రముఖులు కొనియాడారని తెలిపారు. అలాంటి మహనీయురాలి పేరును అసంబంధ విషయాల్లో ప్రస్తావించడం సరైంది కాదని అన్నారు. రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుండి తొలగించాలని, వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకురాలని, ఆమెను అవమానించే వ్యాఖ్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

## జివి మార్ట్ ను ప్రారంభించిన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు..



**మెదక్ జిల్లా -26మార్చ్, (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలో గీత స్కూల్ ప్రక్కన జి వి మార్ట్ ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్ట్ యజమాని మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకై పరితపించే సేవకుడు మన అందరి ప్రియతమ నాయకులు జనహృదయనేత మెదక్, మల్కాజిగిరి నియోజకవర్గల మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంత రావు అని అన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్, కౌన్సిలర్లు మాజీ చైర్మన్లు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుమరియు యువజన మహిళా విభాగాలు అన్ని రకాల అనుబంధ సంస్థ నాయకులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు



**నేరేడుగొమ్ము, మార్చి 26: (మహాప్రభ)**



విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నేరేడుగొమ్ము ఎమ్మార్వో ఉమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీజీఎంఎస్ అండ్ జూనియర్ కాలేజీలో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కే. శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రిన్సిపల్ కే. శిరీష మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవా భావం పెంపొందుతాయని తెలిపారు.పాఠశాల ఇన్‌చార్జి ఏ. కోటేష్ మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగాలని, చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్ శ్రీను నాయక్, గైడ్ టీచర్ రాజ్యలత, ఆంజనేయులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిరికొండ ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

**సిరిసిల్ల ప్రతినిధి మార్చి 26(మహాప్రభ)**
కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో దోమల నివారణ కోసం సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని ట్రాక్టర్ ద్వారా ప్రతి వాడలో పిచికారీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం సర్పంచ్ ముదాం రవి , ఉపసర్పంచ్ , వార్డు సభ్యులు ఒ గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో కొనసాగుతోంది. గ్రామంలో ఆరోగ్య రక్షణ కోసం ఈ చర్యలు చేపట్టబడుతున్నాయి.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం....



**శివంపేట,మార్చి 26 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని లింగోజిగూడ గ్రామంలో దొంతి మల్లేశం అనారోగ్యంతో మరణించడం జరిగింది.. తన అనుచరుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న తాజా మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ అమృత అశోక్ గౌడ్ ల కుమారుడు అరవింద్ గౌడ్ తో అందజేశాడు.ఈ కార్యక్రమంలో రాజు, రమేష్,నర్సింలు, పోచయ్య,నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామనవమి సీతారాముల కళ్యాణం ఉత్సవానికి ఆహ్వానం



**శివంపేట మార్చి 26(మహాప్రభ)**
శివంపేట మండలంలోని శభాష్‌పల్లి గ్రామంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామనవమి సీతారాముల కళ్యాణోత్సవానికి మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దస్ రాధా మహేష్ గౌడ్‌ను గ్రామ నేతలు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నిర్వాహకులతో కలిసి కళ్యాణోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## శిరసనగండ్ల జాతరకు... ప్రత్యేక బస్సులు

**-డిపో మేనేజర్ విజయ కుమారి**

**దేవరకొండ మార్చి 26( మహా ప్రభ ) దేవరకొండ**
ఆర్టీసీ డిపో నుంచి నాగర్ కర్నూలు జిల్లా చారగొండ మండలం శిరసనగండ్ల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి జాతర సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. శుక్రవారం శ్రీరామనవమి స్వామివారి కల్యాణోత్సవం, మరియు రథోత్సవం సందర్భంగా దేవరకొండ, డిండి బస్ స్టేషన్ల నుంచి ప్రయాణికుల రద్దీ కనుగుణంగా బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠశాల విద్యార్థులకు నూతన బోరు పంపుసెట్టు, ఏర్పాటు



**తాడ్వాయి – మార్చి 26 (మహాప్రభ)**
తాడ్వాయి మండల్ కన్కల్ గ్రామంలో గురువారం రోజున, పాఠశాలలోని విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక పాఠశాలలో నూతన బోర్ పంపు సెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని, పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ కట్టుబడి ఉందన్నారు. ఉపసర్పంచ్ చాకలి మహేందర్, సెక్రటరీ, విక్రాంత్ సింగ్, జిపిఓ, మినేష్, పాఠశాల యాజమాన్యం,వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది ఈ చర్యను అభినందించారు.

## నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

**-బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ మార్చి 26( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా శ్రీరామ నవమిని భక్తి,శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.నవమి రోజున ప్రతి ఏటా వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకుంటారని అన్నారు. లోక కళ్యాణం కోసం ఎన్నోత్యాగాలను కోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని,రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని ఆయన తెలిపారు.సీతారాముల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామచంద్రమూర్తులను ప్రార్థించనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖ,సంతోషాలతో శ్రీరామనవమి జరుపుకోవాలని కోరారు.

## రైతుకు జాతీయస్థాయి అవార్డు



**దేవరకొండ మార్చి 26( మహా ప్రభ)**
దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం లోని పోలేపల్లి గ్రామానికి చెందిన లోకసాని పద్మా రెడ్డి కి జాతీయస్థాయి “ ఛాంపియన్ ఫార్మర్ అవార్డు” అందుకున్నారు, ఘజియాబాద్ లో కేంద్ర వ్యవసాయ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్ సెమినార్ లో బుధవారం అవార్డును అందుకున్నారు. 12 ఎకరాల్లో కుంకుడు సాగు తో పాటు రసాయనాలు లేకుండా వివిధ పంటలను పండించినందుకు గుర్తింపుగా అవార్డును పొందుకున్నారు, లోకసాని పద్మా రెడ్డి మాట్లాడుతూ తనను గుర్తించి అవార్డు ఇచ్చినందుకు వ్యవసాయ కేంద్ర సంక్షేమ శాఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు,

## ఆలయాలు ముస్తాబు

**ఆమనగల్లు, మార్చి 26( మహా ప్రభ)**
శ్రీ రామనవమిని పురస్కరించుకుని నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్, శ్రీ భక్తమార్కండేయస్వామి, పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, అయ్యసాగరంలోని రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల పెళ్లి జరపనున్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్తుల తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

# విజయవంతంగా ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



**కరీంనగర్ రూరల్, మార్చి 26 మహాప్రభ**
కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నగునూరు గ్రామంలో నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నేటితో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజుల పాటు శ్రమదానం, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు, సామాజిక అవగాహన ర్యాలీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఇలాంటి శిబిరాల్లో పాల్గొనడం ద్వారా సేవాభావాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ, వాలంటీర్లు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలని, రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఏసీ ఓబి సంపత్ కుమార్, ఏఓబి శ్రవణ్ కుమార్, మాజీ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, డాక్టర్ ఎండి. అలీ ఖాన్, ప్రోగ్రాం అధికారులు డి. సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్, డాక్టర్ ఎంఏ. సలీం, అధ్యాపక బృందం మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు





**కరీంనగర్ రూరల్, మార్చి 26 మహాప్రభ**
పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన పోతురాజుల కోటి, బొమ్మకల్ గ్రామానికి చెందిన సుద్దాల పరశు రాములు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా దుర్శేడ్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అక్రమంగా రవాణా చేసి మరలా పట్టుబడినట్లయితే వారి వాహనాలను సీజ్ చేసి వేలం వేయడానికి కోర్టు, ఆర్టీవో, మైనింగ్ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. మొదటిసారి పట్టుబడిన వారిని ఎమ్మార్వో ముందు బైండ్ ఓవర్ కొరకు హాజరుపరుస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ ఇసుక రవాణాను సహించేది లేదని స్పష్టం చేశారు. ఇసుక రవాణా మానుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదని తెలిపిన బంకు యజమానులు



**పాలకుర్తి, మార్చి 26 మహాప్రభ**
పాలకుర్తి మండలంలోని నాలుగు పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత లేదని బంకు యజమానులు తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్‌ను పుష్కలంగా నిల్వ చేస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కొంతమంది ఇరాన్, ఇశ్రాయేల్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని కారణంగా చూపుతూ బంకుల్లో స్టాక్ లేదని బోర్డులు పెట్టారని ప్రచారం చేయడం వాస్తవం కాదని, ఇది కేవలం దుష్ప్రచారమేనని డీలర్లు స్పష్టం చేశారు. మండలంలో ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్ కొరత అనేది లేదని, వినియోగదారులు ఎలాంటి అపోహలకు గురై తొందరపడవద్దని బంకు యజమానులు తెలిపారు.

# రామాయంపేట నియోజకవర్గ పునరిద్ధరించాలి






**రామాయంపేట మార్చి 26 మహాప్రభ**
రామయంపేట పట్టణాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. రామాయంపేట ఇప్పటికే చాలా వెనుకబడి ఉన్నందున నియోజకవర్గం కోల్పోయిన ప్రాంతం కావడం వలన ఇప్పుడు జరిగే నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా రామాయంపేట కు ఒక మంచి అవకాశం రావడం వల్ల ఈ యొక్క ప్రాంతాన్ని మరియు అధికార అధికారులు ప్రభుత్వం గుర్తించి ఈ యొక్క రామాయంపేట ను నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, అభివృద్ధికి నోచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మార్వో గారికి మెమోరండం అందజేసినట్లు బి ఆర్ ఎస్ నాయకులు తెలిపారు . రామాయంపేట గత చరిత్ర చూసుకున్నట్లయితే రామాయంపేట 1952లో ప్రథమంగా నియోజకవర్గంగా కావడం జరిగింది తదుపరి 2009 వరకు సుమారుగా 14 రామాయంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగింది. అందులో సుమారు కాంగ్రెస్ ఆరుసార్లు టిడిపి మూడుసార్లు బిజెపి రెండుసార్లు ఇండిపెండెంట్లు రెండుసార్లు టిఆర్ఎస్ పార్టీ ఒక్కసారి గెలవడం జరిగిందన్నారు. కానీ ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోనందున గుర్తింపు లేక నియోజకవర్గం కోల్పోవడం జరిగింది ఈ ప్రాంతం నుంచి 1983లో టి అంజయ్య గారు గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించడం జరిగింది కావున ఇప్పటికైనా ఈ రామన్ పేటను గుర్తించి ఉన్న నియోజకవర్గాన్ని కోల్పోయిన రామన్ పేటను తిరిగి నియోజకవర్గంగా పునరుద్ధరించాల్సిందిగా డిమాండ్ చేస్తూ మెమోరడం ఇవ్వడం జరిగింది తదుపరి కార్యచరణగా నియోజకవర్గాల పునరుద్ధరణ మొదలుపెట్టాక తదుపరి కార్యాచరణ బిఆర్ఎస్ పార్టీ ప్రకటిస్తుందని దే ఏ ఎటువంటి పోరాటానికైనా వెనుకపోవడమని టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సాధించేవరకు అహర్నిశలు రాత్రింబలు కష్టపడినా సరే నియోజకవర్గం సాధించుకుంటామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు.

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం



**మంచిర్యాల, మార్చి 26 మహాప్రభ**
బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేయాలని, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణకు డీఎంఎఫ్‌టి నిధుల ద్వారా ఆటోలు అందించామని, సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా 2.50 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, సోలార్ లైటింగ్ ఏర్పాటు, త్రాగునీటి సరఫరా వంటి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. 2026--27 సంవత్సరానికి 32.42 కోట్ల రూపాయల బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4.77 కోట్ల రూపాయలు సాధారణ ఆదాయం, 26.28 కోట్ల రూపాయలు గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, 55 లక్షల రూపాయల నిల్వలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, 34 వార్డులలో ఒక సంవత్సరంలో మురికివాడలను పూర్తిగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో జాతీయ రహదారి 63 విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నస్పూర్ మండల కేంద్రంలో బాలసదనం భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మిషన్ వాత్సల్య నిధులతో 1.34 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం జరుగుతుందని, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

# దత్తత గ్రామాలకు చలివేంద్రాల ఏర్పాటు లేక అసంతృప్తి




**పాలకుర్తి, మార్చి 26 మహాప్రభ**
పాలకుర్తి మండలం బసంతనగర్ ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దత్తత గ్రామాలైన పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ పరిధిలోని బసంతనగర్ గ్రామంలో మాత్రమే ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, నిరంతరం కాలుష్య సమస్యలతో బాధపడుతున్న దత్తత గ్రామాలను విస్మరించడం సరైనదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కంపెనీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు లభించి అభివృద్ధి జరుగుతుందని ఆశించి తక్కువ ధరలకు భూములు ఇచ్చిన గ్రామాలకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, గతంలో కేశోరాం కంపెనీగా ఉన్నప్పుడు వేసవి ప్రారంభం కాగానే దత్తత గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ అంబలి, చల్ల, గొడుగులు పంపిణీ చేసేవారని గుర్తు చేసుకున్నారు. ఆల్ట్రాటెక్ కంపెనీగా మారిన తర్వాత సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా కంపెనీ అధికారులు స్పందించి దత్తత గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రామాయంపేట బస్టాండ్‌లో చీకట్లో ప్రయాణికులు





**రామయంపేట మార్చి 26 మహాప్రభ**
ప్రనికులకు సాయంత్రం ఇక్కడకన్న వెళ్లాలను పూర్తిగా బస్టాండ్లో చీకటి ఉండటం వల్ల మహిళా ప్రయాణికులు భయపడుతున్నారు కనీసం బస్టాండ్ లో వీధిదీపాలు లేక అలాగే బస్టాండ్ ముందర నేమ్ బోర్డ్స్ లేక కూడా ప్రజలు ఎక్కడికి వెళ్లాలని తెలియక బోర్డులు సరిగా ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు సాయంత్రం .కాలంలో వీధి దీపాలు లేకుండా ఇబ్బంది కలగకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు కనీసం బస్సుల ముందు బస్టాండ్ పైన డిపోల పేర్లు రాయించగలరని. ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బిజినెస్

## 25.86% తగ్గిన ఎన్ఆర్ఐ డిపాజిట్లు



న్యూఢిల్లీ
భారత్ నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వేగంగా తరలిపోతుండగా.. మరోవైపు ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) డిపాజిట్లు భారీగా క్షీణించాయి. ఇటీవల కాలంలో ఎన్ఆర్ఐలు చేసే డిపాజిట్లలో భారీ తగ్గుదల నమోదైందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) గణాంకాలు వెల్లడించాయి. కేంద్ర బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం.. 2025 ఏప్రిల్ నుండి 2026 జనవరి మధ్య కాలంలో ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు 25.86 శాతం క్షీణించి 10.61 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఈ పెట్టుబడులు 14.31 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. జనవరి 2026 నాటికి ఎన్ఆర్ఐ మొత్తం బకాయి (అవుట్‌స్టాండింగ్) ఉన్న డిపాజిట్లు 165.78 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇవి అంతకుముందు నెల డిసెంబర్ 2025లో ఉన్న 169.27 బిలియన్ డాలర్ల కంటే తక్కువ. ముఖ్యంగా విదేశీ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సిఎన్ఆర్-బి) డిపాజిట్ల ప్రవాహంలో భారీ వ్యత్యాసం కనిపించింది. ఈ డిపాజిట్లు గత ఏడాది ఏప్రిల్ -- జనవరి కాలంలో 7.02 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఏకంగా 0.94 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ప్రస్తుతం ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లో ఎఫ్‌సిఎన్ఆర్, ఎన్ఆర్ఇ, ఎన్ఆర్ఒ డిపాజిట్లు ప్రధాన భాగాలుగా ఉన్నాయి.

# పసిడి ప్రియులకు బ్యాడ్‌న్యూస్..

### జస్ట్ 4గంటల్లోనే భారీగా పెరిగిన ధరలు! తులం ఎంతంటే



పసిడి ప్రియులకు ఇదో బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే గత కొన్ని రోజులుగా వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి మళ్లీ పరుగులు పెడుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్యలోనే 24 క్యారెట్ల 10 గ్రాములు బంగారంపై రూ.220 పెరిగింది. కాగా ఉదయం రూ.1,46,680గా ఉన్న తులం బంగారం ధర ప్రస్తుతం 1,46,890 వద్ద కొనసాగుతోంది. భారీ హెచ్చుతగ్గుల తర్వాత హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,490గా ఉండగా ఉదయం 6గంటలకు ఈ ధర రూ.1,46,680 వద్ద స్థిరపడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం విషయానికి వస్తే ధర రూ.1,34, 650 వద్ద కొనసాగుతుంది. ఇక వెండి ధర రూ.2,60,000 వద్ద కొనసాగుతోంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నం, విజయవాడ సహా బెంగళూరు, ముంబై, పూణెలో సైతం ఇవే రేట్లు కొనసాగుతున్నాయి. ఈ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,490గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34, 650 వద్ద కొనసాగుతుంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,040 వద్ద కొనసాగుతుండగా ఉదయం ఈ ధర ర రూ.1,46,830గా ఉంది. ఇక 22 క్యారెట్ల తులం బంగారం రూ.1,34,800 వద్ద కొనసాగుతుంది. ఇక చెన్నైలో తులం బంగారం ధర రూ.1,49,130గా ఉంది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. బుధవారం ఒక్క రోజే కేజీ బంగారంపై ఏకంగా రూ.15 వేల వరకు పెరిగింది. ఇక గురువారం జాతీయ మార్కెట్‌లో కేజీ బంగారం ధర రూ. 2,50,000 వద్ద కొనసాగుతుంది. అయితే బంగారం, వెండి ధరలు ఎప్పికప్పుడూ మారుతూ ఉంటాయి. కాబట్టి తాజా రేట్ల కోసం మీ దగ్గర్లోని గోల్డ్ షాప్‌లను సందర్శించండి.

## మెటాలో 700 ఉద్యోగులపై వేటు

శాన్‌ఫ్రాన్సిస్కో
ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తన రియాలిటీ ల్యాబ్స్, సేల్స్, ఫేస్‌బుక్ విభాగాల్లోని 700 మంది ఉద్యోగులను తొలగించింది. అయితే ఈ వేటు ప్రకటనకు ముందే టాప్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం రూ.8,600 కోట్ల భారీ స్టాక్ ఆప్షన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించడం ఇప్పుడు టెక్ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసింది. ఎఐ రంగంలో పెట్టుబడులు పెంచుతున్న క్రమంలో ఈ ఏడాది సుమారు 16,000 మందిని తొలగించాలని మెటా భావిస్తోంది. మరోవైపు అత్యున్నత నైపుణ్యాలు కలిగిన కీలక అధికారులు సంస్థను వీడకుండా




ఉండేందుకే వచ్చే ఐదేళ్లలో దాదాపు 921 మిలియన్ డాలర్ల (రూ.8600 కోట్లు) మేర అదనపు వేతన పరిహారాన్ని కల్పించేలా ఈ ప్యాకేజీని రూపొందించింది. సామాన్య ఉద్యోగులపై వేటు వేస్తూ, అగ్రశ్రేణి అధికారులకు వేల కోట్ల నజరానా ప్రకటించడంపై సాధారణ టెక్ ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

# స్పోర్ట్స్

## ఏడాదంతా క్రికెట్ జాతర..

**-2026-27 సీజన్ షెడ్యూల్ విడుదల**
**-5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లు**
**-హైదరాబాద్‌లో ఒక వన్డే, టీ20**

ముంబై
భారత క్రికెట్ అభిమానులకు ఈ ఏడాదంతా క్రికెట్ పండుగే. శనివారం నుంచి ఐపీఎల్ ఆరంభమవ్వాల్సి ఉండగా అది ముగిసిన (జూన్‌లో) తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లతోనూ ఏడాదంతా క్రికెట్ సందడి పంచడానికి బీసీసీఐ షెడ్యూల్ సిద్ధం చేసింది. వచ్చే సెప్టెంబర్ నుంచి మొదలుకాబోయే 2026-27 సీజన్‌లో టీమ్‌ఇండియా స్వదేశంలో 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లతో అలరించనుంది. ఈ మేరకు బోర్డు 2026-27 హోం సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జనవరి-మార్చి మధ్య జరుగబోయే



ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో ఐదు టెస్టుల (నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్)కు గాను ఈశాన్య రాష్ట్రమైన అసోంలోని బర్సపుర స్టేడియం (గువాహటి) ఆతిథ్యమివ్వనుండటం గమనార్హం. ఈ మైదానం నిరుడు భారత్, దక్షిణాఫ్రికా టెస్టుకు ఆతిథ్యమిచ్చినా మరో మ్యాచ్‌ను దక్కించుకోవడం గమనార్హం. ఇక టెస్టులకు ఆతిథ్యం దక్కకపోయినా హైదరాబాద్ అభిమానులు ఈ బిజీ షెడ్యూల్‌లో ఒక టీ20 (వెస్టిండీస్‌తో), ఒక వన్డే (జింబాబ్వేతో) మ్యాచ్ చూసే అవకాశం లభించింది. వన్డే వరల్డ్ కప్ దృష్ట్యా వన్డేలకు ఎక్కువ ప్రాధాన్యమున్న నేపథ్యంలో మొదట వెస్టిండీస్‌తో సెప్టెంబర్‌లో మూడు వన్డేలు, డిసెంబర్‌లో శ్రీలంకతో మూడు, జనవరిలో జింబాబ్వేతో మూడు వన్డేలు జరుగుతాయి. 2002 తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. వన్డేలు మాత్రమే ఆడుతున్న రోహిత్, కోహ్లీ ద్వయం అభిమానులకు ఇది శుభవార్తే.

## సీజన్ మధ్యలో బరిలోకి దిగుతా

### కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడి

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గుడ్ న్యూస్ చెప్పాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న తాను వేగంగా కోలుకుంటున్నానని, సీజన్ మధ్యలో బరిలోకి దిగుతానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్ సందర్భంగా వెన్ను గాయానికి గురైన ప్యాట్ కమిన్స్.. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ గాయం కారణంగానే అతను ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కూడా ఆడలేదు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలను ఇషాన్ కిషన్‌కు అప్పగించారు. గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరమైనా.. ప్యాట్ కమిన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసాడు. గాయంతో ఇబ్బంది పడుతున్నా జట్టుతో కలిసి



అతను ప్రయాణించనున్నాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కమిన్స్ పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. తాజాగా టీమ్ సోషల్ మీడియా టీమ్‌తో మాట్లాడిన కమిన్స్.. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టుకు అందుబాటులోకి వస్తానని చెప్పాడు. 'నేను వెన్ను గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నా. ప్రస్తుతం నేను బాగానే ఉన్నా. చిన్నగా నెట్స్‌లో బౌలింగ్ కూడా చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ఆరంభ మ్యాచ్‌లు ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నీ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా తొలి మ్యాచ్ చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం(మార్చి 28న) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే.

## 'నా ప్రయాణం ముగిసింది'..

### -కెరీర్‌కు కరోలినా మారిన్ వీడ్కోలు



న్యూఢిల్లీ :
బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ప్రస్థానం ముగిసింది. తన అద్భుత ఆటతీరుతో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన మారిన్ తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించింది. మోకాలి గాయం కారణంగా కోర్టుకు దూరమైన మారిన్ తన సోషల్‌మీడియా అకౌంట్ల ద్వారా రిటైర్మెంట్ వీడియో సందేశాన్ని వెలువరించింది. రియో(2016) ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో పాటు మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిళ్లు సొంతం చేసుకున్న 32 ఏండ్ల మారిన్ గత కొంత కాలంగా మోకాలి గాయంతో తీవ్రంగా బాధపడుతున్నది. 'ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది. గాయంతో శరీరాన్ని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు' అని పేర్కొంది.




# శ్రీరామనవమి కానుకగా 'వాల్మీకి రామాయణం' ఫస్ట్ లుక్ విడుదల

భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్ . ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. "పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది" అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు.చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# టాలీవుడ్‌లో అతనంటే చాలా ఇష్టం..

## పెళ్లి కాకపోతే డేటింగ్ చేసేదాన్ని

అనసూయ భరధ్వాజ్.. ఈ పేరు రెగ్యులర్‌గా వార్తల్లో వినిపిస్తూనే ఉంటుంది. ఈ అందాల భామకు ఉన్న క్రేజ్ గురించి, ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్టార్ హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా ఈ ముద్దుగుమ్మ ఫ్యాన్ బేస్ ఉంది.యాంకర్‌గా మంచి క్రేజ్ తెచ్చుకున్న అనసూయ. ఆ తర్వాత సినిమాల్లో నటిస్తూ ఆకట్టుకుంది. జబర్దస్త్ ద్వారా అనసూయ బాగా పాపులర్ అయ్యింది. ఈ కామెడీ షోలో తన యాంకరింగ్‌తో పాటు అందాలతోనూ ఆకట్టుకుంది ఈ చిన్నది. ఇక సినిమాల్లోనూ కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తుంది ఈ బ్యూటీ. అలాగే పలు టీవీ షోలతోనూ బిజీగా ఉంది అనసూయ.ఇక సోషల్ మీడియాలోనూ అనసూయ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన గ్లామరస్ ఫొటోలతో పాటు తనపై ట్రోల్ చేసే వారికి కౌంటర్లు ఇస్తూ ఉంటుంది. గతంలో అనసూయ చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ గా మారింది. అనసూయ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన అభిమాన హీరో గురించి మాట్లాడింది. అలాగే తన లవ్ రిలేషన్ గురించి కూడా చెప్పిందితన జీవితంలో ప్రేమ గురించి మాట్లాడుతూ.. తన లైఫ్ లో ఒకే ఒక్క బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు అతన్నే నేను పెళ్లి చేసుకున్నా అని తెలిపింది అనసూయ. ఒక వేళ పెళ్ళికాకుండా ఉంటే ఏ హీరోతో డేటింగ్ చేస్తారు అని అడగ్గన్నే ఏమాత్రం తడబడకుండా రామ్ చరణ్ పేరు చెప్పేసింది.తనకు చరణ్ అంటే చాలా ఇష్టమని.. ఒకవేళ పెళ్లి కాకుండా ఉంటే చరణ్ తో డేటింగ్ చేస్తా అని అనసూయ తెలిపారు. రామ్ చరణ్ నటించిన రంగస్థలం సినిమాలో అనసూయ రంగమ్మత్తగా నటించి మెప్పించింది. ఇక ఇప్పుడు చరణ్ గురించి అనసూయ చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ గా మారాయి.

# శ్రీలీల రూట్లో ట్రావెల్ చేస్తున్న మమిత



ప్రస్తుతం నటీమణుల స్క్రీన్ లైఫ్ గురించి ఎవరూ ఆందోళన చెందడం లేదు. తమ నైపుణ్యంతో అవకాశాలు సృష్టించుకోవడమే ముఖ్యమని వారు విశ్వసిస్తున్నారు. ఈ కోవలో శ్రీలీల, మమితా బైజు కెరీర్ ప్రణాళికలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. శ్రీలీల తన కెరీర్ ఉన్నత దశలో కేవలం కమర్షియల్ హీరోయిన్‌గా కాకుండా, భగవంత్ కేసరి వంటి చిత్రాల్లో బాలకృష్ణ వంటి మాస్ హీరోతో కలిసి నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆమె నటనకు ఉత్తమ ప్రతిస్పందన లభించింది. ఇటీవల విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలోనూ శ్రీలీల పాత్రకు మంచి మార్కులు పడ్డాయి.శ్రీలీల అనుసరించిన ఈ విధానాన్ని మమితా బైజు కూడా అదేవిధంగా పాటిస్తున్నారు. ఒక బబ్లీ గర్ల్‌గా గుర్తింపు తెచ్చుకున్న మమితా, ప్రస్తుతం జనగణమన చిత్రంలో భగవంత్ కేసరిలో శ్రీలీల పోషించిన తరహా పాత్రలో కనిపించనున్నారు.




# నవ్వులు పూయిస్తూనే భయపెడుతున్న'రాకాస' ట్రైలర్

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో యూత్ లో క్రేజ్ సంపాదించుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్ సోలో హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాకాస'. జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ బుధవారం ఘనంగా విడుదలైంది. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా హారర్, కామెడీ, ఫాంటసీ అంశాల కలయికతో రూపొందింది. అమెరికా నుంచి ఒక కుర్రాడు (సంగీత్ శోభన్) తన ఊరికి తిరిగి వచ్చినప్పుడు, అక్కడి ఒక పాడుబడ్డ కోట వెనుక ఉన్న మిస్టరీలో ఎలా చిక్కుకున్నాడనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ఊరు మొత్తం కలిసి ఒక బ్రహ్మరాక్షసుడికి హీరోను బలి ఇవ్వాలని చూడటం, ఆ విపత్కర పరిస్థితుల నుంచి హీరో తన కామెడీ టైమింగ్‌తో ఎలా తప్పించుకున్నాడనేది సినిమాలో ప్రధానాకర్షణగా నిలవనుంది.వెన్నెల కిశోర్, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఈ 'రాకాస'తో మరో హిట్ కొట్టాలని భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# 'దృశ్యం3' రిలీజ్ డేట్ ఖరారు ..

## మోహన్‌లాల్ క్రైమ్ థ్రిల్లర్‌కు కొత్త తేదీ ప్రకటించిన మేకర్స్

మలయాళ చిత్ర పరిశ్రమ థ్రిల్లర్ సినిమాలకు పెట్టింది పేరనే విషయం తెలిసిందే. ఆ జానర్‌లో ట్రెండ్ సెట్ చేసిన చిత్రాల్లో ముందుంటుంది దృశ్యం మూవీ. సూపర్ స్టార్ మోహన్ లాల్ హీరోగా, దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించిన ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు ఇప్పటికే రెండు భాగాలు భారీ విజయాన్ని అందుకున్నాయి. దీంతో ఇప్పుడు మూడో భాగమైన దృశ్యం3పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.మొదట ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లు సమాచారం. అయితే గల్ఫ్ దేశాల్లో నెలకొన్న పరిస్థితుల కారణంగా రిలీజ్ వాయిదా పడొచ్చని వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు.ఇప్పుడు ఆ అనుమానాలకు తెరదిస్తూ మేకర్స్ అధికారికంగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. తాజా పోస్టర్ ద్వారా ఈ సినిమాను ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ సాలిడ్ క్రైమ్ థ్రిల్లర్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు స్పష్టత వచ్చింది. ఈ చిత్రానికి సంగీతాన్ని అనీల్ జాన్సన్ అందిస్తుండగా, నిర్మాణ బాధ్యతలను ఆంటోని పెరుంబవూర్ చేపట్టారు. గత భాగాల మాదిరిగానే ఈ సినిమా కూడా ఉత్కంఠభరితమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. మొత్తానికి, 'దృశ్యం 3' రిలీజ్ డేట్ ఖరారవడంతో మలయాళ సినిమా అభిమానుల్లో మళ్లీ ఆసక్తి నెలకొంది. ఈసారి కథ ఎలాంటి మలుపులు తిరుగుతుందో, మోహన్‌లాల్ పాత్ర ఎలా కొనసాగుతుందో చూడాలని సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సమ్మర్‌కి దృశ్యం3 పర్ఫెక్ట్ మూవీ. ఫ్యామిలీస్‌తో చూడదగ్గ థ్రిల్లర్ అని అనుకున్న మూవీ లవర్స్ .. సినిమా వాయిదా పడిందని తెలిసి కాసింత డీలా పడినా, నయా డేట్ రావడంతో ఊరట పొందుతున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com